క్లుప్తంగా

177 మంది ఆక్రమణదారులకు నోటీసులు


కుమారస్వామి

కొయ్యూరు: మండలంలోని రాజేంద్రపాలెం, కొయ్యూరు, చీడిపాలెం పంచాయతీ సింగవరంలో 177 మంది ఆక్రమణదారులను గుర్తించామని ఇన్‌చార్జి తహసీల్దార్ కుమారస్వామి తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఆర్అండ్‌బీ స్థలాలను ఆక్రమణదారులను గుర్తించామని ఆయన శుక్రవారం విలేకరులకు తెలిపారు. రాజేంద్రపాలెంలో 105 మందిని, సింగవరంలో 48మంది, సూరేంద్రపాలెంతో ఏడుగురు ,కొయ్యూరులో 17 మందిని గుర్తించినట్టు తెలిపారు. త్వరలో వారందరికి నోటీసులు ఇస్తామన్నారు.గతంలో నిర్దేశించిన దాని ప్రకారం సర్వే చేశామన్నారు. 65 సంవత్సరాలు దాటిన వారికి రేషన్ ఇంటికి తీసుకెళ్లి ఇవ్వాలని ఆదేశించామన్నారు. అలాంటివారు 1470 మందిని గుర్తించామన్నారు. మొత్తం 16,627 కార్డులున్నాయన్నారు.

కొయ్యూరు సీడీపీవో బదిలీ


ఉత్తమ సీడీపీవోగా ఎంపికైనా విజయకుమారిని సన్మానిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్ (ఫైల్)

కొయ్యూరు: సీడీపీవో విజయకుమారికి నూజివీడు బదిలీ అయింది. గడిచిన మూడేళ్లుగా సీడీపీవోగా విజయకుమారి మండలాన్ని ఐసీడీఎస్ శాఖలో ప్రథమ స్థానంలో ఉంచారు. ఈ మేరకు ఆమె సేవలను గుర్తించి ఉత్తమ సీడీపీవోగా మూడుసార్లు అవార్డు ఇచ్చారు. స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆర్‌జేడీ చిన్మయదేవి సైతం ఆమెను కొనియాడారు. ఆమె స్థానంలో రాజవొమ్మంగి సీడీపీవో దేవమణి ఇక్కడికి బదిలీపై వస్తున్నారు.

పిచ్చికుక్క దాడిలో ముగ్గురికి గాయాలు


పిచ్చికుక్క దాడిలో గాయపడిన బాలుడు శివరాం

రాజవొమ్మంగి: మండలంలోని జడ్డంగి గ్రామంలో శుక్రవారం కొందరిపై ఓ పిచ్చి కుక్క దాడి చేయడంతో గాయాలపాలయ్యారు. గాయపడిన వారిలో గ్రామానికి చెందిన పులిమెట్ల వెంకటరమణ, చిన్నారులు నాగం శివరాం, లాస్య ఉన్నారు. వీరిని జడ్డంగి పీహెచ్‌సీకు తరలించగా వైద్య సిబ్బంది ప్రథమ చికిత్స అందించిన అనంతరం మెరుగైన వైద్యం కోసం అడ్డతీగల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

బాలికల ఆరోగ్యంపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న సీడీపీవో రమణ

చింతపల్లి: కిశోర బాలికలు ఆరోగ్యంపై తీసుకోవలసిన జాగ్రత్తల పట్ల అంగన్‌వాడీలు అవగాహన కల్పించాలని సీడీపీవో జి.వి.రమణ అన్నారు. కిశోర వికాసం కార్యక్రమంలో భాగంగా జిల్లా పరిషత్ పాఠశాలలో మండలంలో గల అంగన్‌వాడీ కార్యకర్తలతో శుక్రవారం సమావేశం ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి గ్రామంలో గల కిశోర బాలికలను గుర్తించి వారు తీసుకోవలసిన పోషక పదార్థాలు, ఆరోగ్య జాగ్రత్తలను వివరించాలన్నారు. ఏసీడీపీవో రామలక్ష్మి, సూపర్ వైజర్లు విజయలక్ష్మి, గౌహర్‌ఉన్నీషా, అప్పల నర్స, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

రేపు ఉచిత వైద్య శిబిరం

రంపచోడవరం: మండల కేంద్రంలో ఈ నెల 8న ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు రామకృష్ణ మిషన్ స్థానిక కార్యదర్శి స్వామి పరిజ్ఞేయానంద శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 3 గంటలు వరకు వైద్య శిబిరం నిర్వహిస్తామన్నారు. గుండె సంబంధించి వ్యాధులు, ఆయాసం, బిపి, సుగర్, చెవి, ముక్కు, గొంతు, ఎముకలు, కీళ్లు, ఫిట్స్ చర్మ వ్యాధులు, పిల్లల వ్యాధులు సామాన్య రోగాలకు కూడా వైద్య నిపుణులు వైద్య సేవలు అందిస్తారన్నారు. పరమహంస యోగానంద నేత్రాలయ ఆధ్వర్యంలో కంటి పరీక్షలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. అవసరమైన వారికి ఉచిత కంటి వైద్య పరీక్షలు, కళ్లద్దాలు అందిస్తున్నట్టు పేర్కొన్నారు. శిబిరానికి కంటి పరీక్షలకు వచ్చే వారు ఆధార్‌కార్డు, తెల్లరేషన్ కార్డు తీసుకురావాలని తెలిపారు.

దారులు ఇలా.. ప్రయాణమెలా

- అసంపూర్తిగా రహదారి నిర్మాణం
- తాత్కాలికంగా పనులు
- వాహనచోదకుల అవస్థలు
- పట్టించుకోని అధికారులు


పొలాల్లోని సారవంతమైన మట్టిని పొక్లెయిన్‌తో తవ్వేస్తున్న దృశ్యం


రోడ్డు ఇరుపక్కల మట్టితో తాత్కాలిక పనులు


రాజవొమ్మంగి – అమ్మిరేఖల రహదారి దుస్థితి

రాజవొమ్మంగి: మండలంలోని చాలా ప్రాంతాల్లో రహదారులు అధ్వానంగ ఉన్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది కావస్తున్నా రహదారుల నిర్మాణాలు, పాడైన రోడ్ల మరమ్మతులపై కనీస దృష్టి సారించలేదు. దీంతో గిరిజనులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాజవొమ్మంగి నుంచి అప్పలరాజుపేట మీదుగా అమ్మిరేఖల వెళ్లే బీటీ రహదారి పనులు అసంపూర్తిగా నిలచిపోవడంతో గిరిజనులు అష్టకష్టాలు పడుతున్నారు. 9 కిలోమీటర్ల నిడివిగల ఈ రహదారిపై మధ్య మధ్యలో రోడ్డు పూర్తికాలేదు. దీంతో ఏ మాత్రం వర్షం వచ్చినా రోడ్డు బురదగా మారి పాదచారులు, వాహన చోదకులు రోడ్‌పై వెళ్లేందుకు నానా ఇబ్బంది పడుతున్నారు. వర్షం వస్తే నీరు చేరి ఎక్కడ గొయ్యి ఉందో తెలియని దుస్థితి నెలకొంది. దీంతో వాహనచోదకులు గోతుల్లో పడి గాయాలపాలవుతున్నారని స్థానికులు చెబుతున్నారు. ఈ రహదారి మీదుగా అమ్మిరేఖల, అప్పలరాజుపేట, కిమ్మిలిగెడ్డ, కొత్తవీధి, ముర్లవారివీధి మీదుగా అమ్మిరేఖలు వారు ఉంది.. ఈ రహదారి నిర్మాణానికి గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో కోటి రూపాయల నిధులు మంజూరు చేశారు. అయితే కొంతమేర రోడ్డు నిర్మించి వదిలేశారు. సీసీ రోడ్డు నిర్మించాలనే సాకుతో పనులు అర్ధంతరంగా నిలిపేశారు. మరోవైపు కిమ్మిలిగెడ్డ సమీపంలో కిలోమీటరు మేర మెటల్ మాత్రమే పరచి బీటీ రోడ్డు నిర్మాణం నిలిపేశారు. దీంతో పైకి తేలిన రాళ్ల వల్ల వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బంది ఏర్పడుతోందని ఆయా గ్రామస్తులు వాపోతున్నారు. మండలంలో ఇదే తరహాలో రాజవొమ్మంగి నుంచి వయ్యేడు మీదుగా బూరుగపల్లి గ్రామానికి వెళ్లే దాదాపు ఆరు కిలోమీటర్ల నిడివిగల రహదారి, లబ్బర్తి మెయిన్ రోడ్ నుంచి డి.మల్లవరం వెళ్లే కిలోమీటరు పొడవైన బీటీ రోడ్, లబ్బర్తి నుంచి ముంజవరప్పాడు మీదుగా కింద్ర వెళ్లే 3 కిలోమీటర్ల పొడవుగల రహదారి పనులను సంభందిత గిరిజన సంక్షేమ శాఖ ఇంజనీర్లు అసంపూర్తిగా వదిలిపెట్టేడయంతో తమకు అనాదిగా రహదారి, రవాణా కష్టాలు తప్పడం లేదని ఆయా గ్రామస్తులు గిరిజనులు వాపోతున్నారు. ఇప్పటికే నిధులు విడుదలైన ఈ రహదారి పనులను త్వరిగగతిన పూర్తి చేసి తమ కష్టాలు గట్టెక్కించాలని కోరుతున్నారు.

కొరవడిన నాణ్యత

వి.ఆర్.పురం: మండలంలో రేఖపల్లి నుంచి చింతూరు వరకు బీటీరోడ్డు నిర్మాణ విస్తరణ పనుల్లో నాణ్యత లోపం బయట పడుతుంది లక్షలాది రూపాయల ప్రభుత్వ నిధులతో జరుగుతున్న రోడ్డు పనులు నాసిరకంగా ఉన్నాయి. ఆర్అండ్‌బీ అధికారుల పర్యవేక్షణ కొరవడిన కారణంగా ఇక్కడ నిర్మిస్తున్న రోడ్డు నిర్లక్ష్యానికి నిలువుటద్దంగా మారింది. రేఖపల్లి నుంచి చింతూరు వరకు సుమారు 90 లక్షల వ్యయంతో 35 కిలోమీటర్ల మేర రోడ్డు పనులు జరుగుతున్నాయి. ప్రభుత్వ నిబంధనల ప్రకారం మెటీరియల్‌ను ఉపయోగించడం లేదని గిరిజనులు ఆరోపిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన రవాణా సౌకర్యం కల్పించేందుకు ప్రభుత్వం లక్షల రూపాయలు నిధులు ఖర్చు చేసి రోడ్డు నిర్మిస్తుండగా కాంట్రాక్టర్ నిర్లక్ష్య వైఖరి కారణంగా సైడ్ బరేమ్స్ మట్టితో పోసి చేతులు దులుపుకుంటున్నారు. రోడ్డు ఇరువైపులా గ్రామాల పోడవునా ఉన్న గిరిజన రైతుల పోలాల్లో నుంచి తీసిన మట్టితో రహదారి అంచులు పూడ్చుతున్నారు. అయితే కురుస్తున్న భారీ వర్షాలకు మొత్తం మట్టి కొట్టుకుపోతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అసలే సింగిల్ రోడ్డు ఆపై రోడ్డు కోతకు గురవుతోందని చెబుతున్నారు. ఎదురుగా వచ్చే వాహనాలు తప్పించే క్రమంలో వాహనచోదకులు అధ్వానంగా ఉన్న రోడ్డు అంచుల వల్ల ప్రమాదాల బారిన పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్రావెల్ పోసి రోలింగ్ చేయవలసిన సైడ్ బరేమ్స్‌ని మట్టితో సరిపెడుతున్నారని చెబుతున్నారు. పనుల్లో కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వల్ల నాణత్య ఉండడం లేదని, అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

పాడేరు రూరల్: మా గ్రామలకు రోడ్డు సౌకర్యం కల్పించాలని సలుగు పంచాయతీ బొడ్రాయి గ్రామానికి సరైన రహదారి లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు సరిగా లేకపోవడంతో గ్రామానికి అత్యవసర సేవలైన 108, 104, అంబులెన్స్ సేవలు అందడం లేదంటున్నారు. రోగులకు అత్యవసర వైద్యం కోసం ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని డోలీమోతలే దిక్కుగా మారాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని వారు కోరుతున్నారు.

అధికారులు స్పందించాలి

రోడ్డు పక్కన పోసే మట్టి పక్కన ఉన్న పొలాల నుంచి తీసి అక్కడే రహదారి అంచున పూడుస్తున్నారు. వర్షాలు వల్ల కొట్టుకుపోతోంది. కాంట్రాక్టర్‌కి చెప్పినా పట్టించుకోవడం లేదు. పొక్లెయిన్ ద్వారా వరి కుంటను గోతులు గోతులుగా తవ్వేస్తున్నారు. రహదారి అంచులను బంక మట్టితో పూడ్చడంతో వర్షానికి కొట్టుకుపోయి వాహనాలు జారిపోయి ప్రమాదాలు జరుగుతాయి. అధికారులు స్పందించాలి. పూర్తిస్థాయిలో మెటల్, సిమెంట్ ఇతర సామగ్రిని ఉపయోగించి, పనుల్లో నాణ్యతగా ఉండేలా చూడాలి.

– గాలి ముత్తయ్య, వి.ఆర్.పురం

వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుల నియామకం


జల్లేపల్లి రామన్నదొర (రంపచోడవరం)


మద్దాల వీర్రాజు (అడ్డతీగల)


వై.రామలింగ రెడ్డి (చింతూరు)


గారపాటి మురళీకృష్ణ (దేవీపట్నం)


అలూరి కోటేశ్వరరావు (కూనవరం)


సత్తి సత్య నారాయణరెడ్డి (మారేడుమిల్లి)


సింగిరెడ్డి రామకృష్ణ (రాజవొమ్మంగి)


యెజ్జు వెంకటేశ్వరరావు (గంగవరం)

రంపచోడవరం: వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు రంపచోడవరం అసెంబ్లీ నియోజకవర్గ మండల పార్టీ అధ్యక్షులను నియమించడం జరిగిందని పార్టీ కేంద్ర కార్యాలయం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపింది. ఈ మేరకు రంపచోడవరం మండల పార్టీ అధ్యక్షుడిగా జల్లేపల్లి రామన్నదొర, అడ్డతీగలకు మద్దాల వీర్రాజు, చింతూరుకు వై.రామలింగరెడ్డి, దేవీపట్నానికి గారపాటి మురళీకృష్ణ, కూనవరంనకు అలూరి కోటేశ్వరరావు, మారేడుమిల్లికి సత్తి సత్యనారాయణరెడ్డి, రాజవొమ్మంగికి సింగిరెడ్డి రామకృష్ణ, వీఆర్ పురానికి మడిరెడ్డి వెంకట సత్యనారాయణ, గంగవరానికి యెజ్జు వెంకటేశ్వరరావులను నియమించినట్లు తెలిపారు.

వేగవంతంగా గృహాలు నిర్మించుకోవాలి


హౌసింగ్ మేళా నిర్వహిస్తున్న అధికారులు

గూడెంకొత్తవీధి: మండలంలోని లక్కవరపుపేట పంచాయతీ బోయపాలెం గ్రామంలో హౌసింగ్ గ్రౌండింగ్ మేళాను నిర్వహించారు. ఎంపీడీవో ఉమామహేశ్వరరావు, ఎంపీపీ బోయిన కుమారి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో లబ్ధిదారులకు పలు సూచనలిచ్చారు. వారు మాట్లాడుతూ నిర్మాణాలను వేగంగా చేయాలని సూచించారు. ఈ అవకాశాన్ని అంతా వినియోగించుకోవాలన్నారు. సర్పంచ్ కె.వీరేంద్ర ప్రసాద్, ఎంపీటీసీ సత్యనారాయణ, ఉప సర్పంచ్ గంగాధర్, ఈవోఆర్‌డీ పాపారావు, హౌసింగ్ జేఈ సూరిబాబు, వర్క్ ఇన్‌స్పెక్టర్ చిట్టి పడాల్, స్థానికులు రామారావు, గోపాలరావు, చంటిబాబు, రాంబాబు, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ పాల్గొన్నారు.

హైవే బాధితుల ఆందోళన తాత్కాలికంగా వాయిదా


బాధితుల సంఘం మండల కన్వీనర్ సీతారాం నాయుడుతో చర్చలు జరుపుతున్న అధికారులు

జి.మాడుగుల: హైవే రోడ్డు నిర్మాణంలో భూములు నష్టపోయిన బాధితులు గత రెండు రోజులుగా చేస్తున్న ఆందోళన కార్యక్రమానికి హైవే అధికారులు స్పందించారు. మండలంలో వంజరి పంచాయతీ కేంద్రంలో హైవే అధికారులు శుక్రవారం జాతీయ రహదారి బాధితుల సంఘం మండల కన్వీనర్ వంజరి సీతారాంనాయుడు, బాధితులతో జరిపిన చర్చలు సఫలమయ్యాయి. జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్‌తో సోమవారం చర్చలు జరిపిన తరువాత భవిష్యత్తు కార్యాచరణ నిర్ణయం తీసుకుంటామని, తాత్కాలికంగా ఉద్యమాన్ని వాయిదా వేస్తున్నట్టు సీతారాంనాయుడు తెలిపారు. ఆదివాసీ గిరిజన సంఘం, జాతీయ రహదారుల బాధితుల సంఘం ఆధ్వర్యంలో చేస్తున్న పోరాట ఫలితంగానే ఎన్‌హెచ్ 516ఈ అధికారి ఏఈవో లోకేష్ బాధితులతో చర్చలు జరిపినట్టు చెప్పారు. గ్రామంలో పంట కాల్వలు నిర్మించటానికి, తాగునీరు పునరుద్ధరణకు అంగీకరించినట్టు ఆయన అన్నారు.బాధితులకు నష్టపరిహారానికి ఈ నెల10న కలెక్టర్‌తో సంఘ నాయకులు, బాధితులు కలిసి చర్చలు జరిపిన తరువాత సానుకూలంగా లేకపోతే తుది నిర్ణయం ప్రకటిస్తామని, అంతవరకు పోరాటాన్ని తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్టు ఆయన తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వ అధికారులు స్పందించి బాధితులకు నష్ట పరిహారం చెల్లించకపోతే భవిష్యత్తులో జరిగే ఉద్యమానికి పూర్తి బాధ్యత ప్రభుత్వానిదేనని ఆయన హెచ్చరించారు. ఎస్‌ఐ షణ్ముఖరావు, హైవే బాధితుల సంఘం కో–కన్వీనర్ వంజరి శ్రీనివాసు, ప్రతినిధులు వంజరి చిరంజీవి నాయుడు, రామూర్తినాయుడు, బాబూరావు, వెంకటలక్ష్మి, కనకాలమ్మ, భారతమ్మ, కళ్యాణం, బాలయ్య, చిన్నయ్య, హరి, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

న్యాయం చేయాలని చిరు వ్యాపారుల ధర్నా


చింతపల్లి తహసీల్దారు కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న చిరువ్యాపారులు

చింతపల్లి రోడ్డు కొలతలలో సమానత్వం పాటించి న్యాయం చేయాలి

చింతపల్లి: మండల కేంద్రంలో రోడ్డు విస్తరణలో భాగంగా రెవెన్యూ అధికారులు చేపడుతున్న సర్వేలో సమానత్వం పాటించి చిరువ్యాపారులకు న్యాయం చేయాలని జెడ్పీటీసీ సభ్యుడు పోతురాజు బాలయ్యపడాల్ కోరారు. ఈ మేరకు తహసీల్దారు కార్యాలయం ఎదుట ఆర్అండ్‌బీ రోడ్డులో జెడ్పీటీసీ, సర్పంచ్ ఆధ్వర్యంలో స్థానికులు ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న జెడ్పీటీసీ సభ్యుడు బాలయ్యపడాల్ మాట్లాడుతూ ఇటీవల హైకోర్టు ఆదేశాల మేరకు ప్రభుత్వ భూములను ఆక్రమించుకుని వ్యాపారాలు సాగిస్తున్న వారికి గడిచిన 10 రోజులు నుంచి నోటీసులు జారీ చేయడంతో ఎంతోమంది స్వచ్ఛందంగా దుకాణాలను తొలగించుకుంటున్నారన్నారు. దశాబ్దాలుగా రోడ్డుకు ఇరువైపులా దుకాణాలు ఏర్పాటుచేసుకొని జీవనం సాగిస్తున్న 250 పైగా కుటుంబాలన్నీ రోడ్డున పడే అవకాశం ఉందన్నారు. రోడ్డు విస్తరణ కారణంగా చిరువ్యాపారులకు నష్టం వాటిల్లకుండా కొలతలలో సమానత్వం పాటించి వారికి న్యాయం చేసే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు. డిప్యూటీ తహసీల్దారు చంద్రశేకఖర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. సర్పంచ్ దురియా పుష్పలత, వైస్ సర్పంచ్ షేక్ నూరు, రాష్ట్ర ఎస్టీ సెల్ ప్రధాన కార్యదర్శి జల్లి సుధాకర్, ఉద్యోగుల సంఘం నాయకుడు వినాయకరావు, సీపీఐ నాయకుడు షేక్ రహిమాన్(బుజ్జి) తదితరులున్నారు.

కూటమి ప్రభుత్వ పాలనలో ప్రజలకు వెన్నుపోటు

జి.మాడుగుల: రాష్ట్రంలో ఎన్నికల సమయంలో సుపర్ సిక్స్ పథకాల పేరుతో అధికారంలోని వచ్చిన కూటమి ప్రభుత్వం ప్రజలకు వెన్నుపోటు పొడిచిందని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు నుర్మని మత్స్యకొండంనాయుడు ధ్వజమెత్తారు. ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ చంద్రబాబు ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలు కనీసం అమలు కావడం లేదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది కావస్తున్నా నేటి వరకు రైతులకు పెట్టుబడి సాయం అందలేదన్నారు. ఆర్థికంగా రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నార. గ్రామాల్లో వలంటీర్లు ప్రజలకు అనేక సేవా కార్యక్రమాలు చేస్తుంటే వారిని తొలగించి కూటమి ప్రభుత్వం వెన్నుపోటు పొడిందని, అదే విధంగా ఇంటింటికీ రేషన్ పంపిణీ చేసే ఎండీయూ వ్యవస్థ రద్దు చేసి కార్డుదారులకు డిపోల ద్వారా పంపిణీ చేయడంతో కార్డుదారులు సుదూరంలో ఉన్నడిపోలకు వెళ్లాల్సి వస్తోందని, వారికి అదనంగా ఆర్థిక భారం పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం ప్రజా వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడుతూ ప్రజలను కష్టాలపాలజేస్తుందని ఆయన అన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం


పెదగూడలో వైద్య సేవలందిస్తున్న వైద్యాధికారి రమేష్, సిబ్బంది

ముంచంగిపుట్టు: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని కిలగాడ వైద్యాధికారి రమేష్ అన్నారు. మండలంలో గల పెదగూడ పంచాయతీ కేంద్రంలో శుక్రవారం ఎఫ్‌డీపీ వైద్య శిబిరం నిర్వహించి 58 మందికి వైద్య సేవలు అందించారు. జ్వరాలతో బాధపడుతున్న వారికి రక్త పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. వైద్య సిబ్బంది ఇంటింటికి వెళ్లి ఆరోగ్య వివరాలు సేకరించారు. మలేరియా, డయేరియా, టైఫాయిడ్, టిబి వంటి వ్యాధులపై గ్రామాల్లో గిరిజనులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి రమేష్ మాట్లాడుతూ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని, అనారోగ్యం బారిన పడిన వెంటనే వైద్యులను సంప్రదించాలని, ఆరోగ్య విషయంలో నిర్లక్ష్యం చేయవద్దని, పరిసరాల పరిశుభ్రత పాటించాలని గ్రామస్తులకు సూచించారు.

అమ్మవారికి వెండి ఆభరణాల బహూకరణ

అనకాపల్లి టౌన్: వేల్పులవీధిలో గల అన్నపూర్ణ సమేత శ్రీకాశీవిశ్వేశ్వర స్వామి దేవస్థానానికి న్యాయవాది మోటూరి విశ్వేశ్వరావు, పద్మలతా దంపతులు వెండి ఆభరణాలు బహూకరించారు. ఆలయ ధర్మకర్త కార్యనిర్వహణాధికారి సమక్షంలో అమ్మవారికి వెండి కన్నులు, రెప్పలు, బొట్టు, గరిట తదితరాలను అందజేశారు.

రోడ్డు పనులు ప్రారంభం


మట్టి రోడ్డు పనులు చేస్తున్న జర్రెలపోదర్ గ్రామస్తులు

ముంచంగిపుట్టు: మండలంలో గల అత్యంత మారుమూల రంగబయలు పంచాయతీ జర్రెలపోదర్ గ్రామానికి రోడ్డు పనులు ప్రారంభమైయ్యాయి. ఉపాధి హామీ పథకం ద్వారా రూ.15లక్షలతో దుండగూడ నుంచి జర్రెలపోదర్ వరకు 6 కిలోమీటర్ల మట్టి రోడ్డు పనులను సర్పంచ్ ధనియా, ఎంపీటీసీ సభ్యురాలు భాగ్యవతి, నేతలు కొబ్బరికాయ కొట్టి పనులను శుక్రవారం ప్రారంభించారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోనే రోడ్డు మంజూరైనా ఎన్నికల కోడ్ వల్ల పనులు నిలిచిపోయాయి. దీంతో అప్పటి నుంచి జర్రెలపోదర్ గ్రామ గిరిజనులు శ్రామదానంతో కొంతవరకు మట్టి రోడ్డును నిర్మించుకున్నారు. సమస్యను అధికారుల దృష్టికి స్థానికులు తీసుకెళ్లడంతో ఎట్టకేలకు మట్టిరోడ్డు పనులు మొదలు కావడం గ్రామ గిరిజనులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. జర్రెలపోదర్‌తో పాటు గొబ్బురపడ, నువ్వగూడ, బుడ్డపనస గ్రామాలకు సైతం రోడ్డు మంజూరు చేయాలని స్థానికులు కోరుతున్నారు. ఉపాధి హామీ పథకం టిఏ సుఖదేవ్ తదితరులున్నారు.

ప్రత్యేక డీఎస్సీ ప్రకటించాలి


మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

దుంబ్రిగుడ: రాష్ట్రంలో గిరిజనులకు ప్రత్యేక స్థానం కల్పించే దిశగా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకొని గిరిజనులకు ప్రత్యేక డీఎస్సీ ఏర్పాటు చేయాలని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పాంగి పరశురామ్, వైస్ ఎంపీపీ ఆనంద్‌రావులు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో శుక్రవారం జరిగిన వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడారు. గిరిజనులకు నూరుశాతం ఉద్యోగాలు కల్పించేందుకు జీవో నెంబర్–3కు ప్రత్యామ్నాయంగా మరో జీవో తీసుకువచ్చి ప్రత్యేక గిరిజన డీఎస్సీ నిర్వహించి తీరుతామని హామీ ఇచ్చిన గిరిజన మంత్రి సంధ్యారాణి, ప్రస్తుతం డీఎస్సీ పరీక్షలు జరుగుతుంటే ఎక్కడ ఉన్నారని వారు ప్రశ్నించారు. ఇదేనా గిరిజన డీఎస్సీ అభ్యర్థుల పట్ల చిత్తశుద్ధి, ఇదేనా గిరిజనుల పట్ల ప్రేమ అని వారన్నారు. ఇప్పటికైనా రాష్ట్రంలో జరుగుతున్న డీఎస్సీతో పాటు పాడేరు ఐటీడీఏ పరిధిలో గిరిజనులకు ప్రత్యేక డీఎస్సీ నిర్వహించేందుకు కూటమి ప్రభుత్వం ముందుకు రావాలని, లేని పక్షంలో ఈ ప్రభుత్వానికి రానున్న రోజుల్లో భారీ మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరించారు. గుంటసీమ సర్పంచ్ గుమ్మ నాగేశ్వరరావు, పోతంగి పంచాయతీ వైస్ సర్పంచ్ శెట్టి జగ్గనాయుడు, నాయకురాలు బబిత, తుమ్‌నాథ్, పరశురాం, దినేష్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన వేసవి విజ్ఞాన తరగతులు


విద్యార్థులకు బహుమతులిస్తున్న సర్పంచ్ కలుముల అక్కమ్మ


కూనవరంలో విజేతలతో నిర్వాహకులు

గంగవరం : స్థానిక శాఖా గ్రంథాలయంలో గత నెల 28 నుంచి నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన తరగతులు శుక్రవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా గ్రంథాలయాధికారి గంగాభవానీ ఆధ్వర్యంలో ముగింపు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ కలుముల అక్కమ్మ, ఆదివాసీ జేఏసీ నాయకుడు కుంజం సిద్ధూ ముఖ్య అతిథులుగా పాల్గొని వివిధ పోటీల్లో ప్రతిభ చూపిన బాలబాలికలకు బహుమతులు అందజేశారు. ఆదివాసీ జేఏసీ నాయకుడు కుంజం సిద్దూ, స్థానిక ఆశ్రమ ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులు సత్యనారాయణ, గోపినాథ్, చంద్రశేఖర్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

కూనవరం: స్థానిక గ్రంథాలయ శాఖ ఆధ్వర్యంలో జరిగిన వేసవి విజ్ఞాన శిక్షణ తరగతుల ముగింపు సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన, చిత్ర లేఖనం, క్విజ్ పోటీల్లో విజేతలకు లైబ్రేరియన్ మాదేటి గోవిందరాజులు ఆధ్వర్యంలో బహుమతులు అందజేశారు. వ్యాసరచన పోటీలో హర్షిత్‌సాయి సచిన్, చిత్రలేఖనంలో టి.బోదన, సాహితిలు, స్టోరీ టెల్లింగ్‌లో కృష్ణ, తేజశ్రీ హర్షలు ప్రథమ బహుమతులు అందుకున్నారు. వారికి పలువురు అభినందనలు తెలిపారు. వి.ఆర్.పురం సిబ్బంది నాగరాజు, బిడీసీ శ్రీనివాసరావు, వెల్ఫేర్ అసిస్టెంట్ సాయిలక్ష్మి, ఇంజనీర్ అసిస్టెంట్ అశోక్, విశ్రాంతి ఉపాధ్యాయుడు వెంకటస్వామి, విజయసాధన హైస్కూల్ హెచ్ఎం రమాదేవి, ఉపాధ్యాయురాలు జాహ్నవి, బుజ్జిబాబు, సత్యనారాయణ, సాయి మహేశ్, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ఆలయ వార్షికోత్సవాలు


పూజలు చేస్తున భక్తులు


చిన్నారుల భరతనాట్యం

రాజవొమ్మంగి: మండల కేంద్రంలోని కళ్యాణ వేంకటేశ్వరస్వామి వారి ఆలయ వార్షికోత్సవ కార్యక్రమాలు శుక్రవారం అంగరంగ వైభవంగా జరిగాయి. ఉదయం నుంచి స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి వారికి వేదపండితులు శాస్త్రోక్తంగా కళ్యాణం జరిపించారు. అనంతరం భారీ అన్నసమారాధన జరిగింది. స్థానికులతో పాటు పరిసర ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి ప్రసాదాన్ని స్వీకరించినట్టు నిర్వాహకులు తెలిపారు.

వేడుకల్లో భాగంగా సాయంకాలం విశాఖపట్నం వాగ్దేవి నృత్యాలయం నుంచి వచ్చిన చిన్నారులు ప్రదర్శించిన కూచిపూడి, భరతనాట్యం ఆకట్టుకుంది.